## ఆర్మూర్ మోడల్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

### సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే



ఆర్మూర్, బతుకమ్మ :పట్టణంలోని మోడల్ స్కూల్‌ను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి అక్కడి విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో జరుగుతున్న బోధనా విధానాన్ని తెలుసుకోవడంతో పాటు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలలో ఉన్న పలు సమస్యలను, అవసరాలను ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర కీలకం

### బిజెపి మండల్ ప్రెసిడెంట్ అరె రవీందర్



భీమ్ గల్, బతుకమ్మ :ప్రజాస్వామ్య దేశంలో ఓటరు పాత్ర అత్యంత కీలకమైందని అట్టి ఓటరు జాబితాను సక్రమంగా రూపొందించడం అత్యవసరమని బీజేపీ మండల్ ప్రెసిడెంట్ అరె రవీందర్ అన్నారు. గురువారం ఆయన సతీమణి మాజీ ఎంపీటీసీ అరె లావణ్యతో కలిసి వారి ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్ ఓ దీప్సన్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎన్నికల సంఘం సూచించిన విధంగా గణన పత్రాలను పూర్తిగా నింపి, అవసరమైన పత్రాలను బీఎల్ ఓ లకు అందజేయాలని కోరారు. ప్రజలు ఎలాంటి అపోహలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ ఈ కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకొని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

### తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్

నిజామాబాద్, బతుకమ్మ : కాంట్రాక్టర్లకు గత నాలుగు సంవత్సరాలుగా బిల్లులు చెల్లించకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పూర్తి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని, బ్యాంకు రుణాలు, వడ్డీలు, జీఎస్టీ, ఇతర పన్నులు, మెటీరియల్ సరఫరాదారుల బకాయిలు, కార్మికుల జీతాలు చెల్లించలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్ల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంట్రాక్టర్లను ఆర్థికంగా దివాళా తీసే పరిస్థితికి ప్రభుత్వం కారణమైందని, ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పెండింగ్ బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్టర్ల సమస్యలపై ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని, బిల్లుల విడుదలకు స్పష్టమైన కాలపట్టికను ప్రభుత్వం ప్రకటించాలన్నారు. కాంట్రాక్టర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, లేని పక్షంలో ఆత్మహత్యలే మాకు శరణ్యమనే దుస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే స్పందించి కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, అభివృద్ధి పనులు పూర్తి చేసినప్పటికీ సంవత్సరాల తరబడి చెల్లింపులు నిలిపివేయడం వల్ల నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని, వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఒక వారంలోగా పెండింగ్ బిల్లుల చెల్లింపులు ప్రారంభించి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించి సచివాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హెచ్చరించింది.

# వచ్చే ఏడు కోటి మొక్కలు నాటుతాం

### మంత్రి సీతక్క పుట్టిన రోజున సెర్ప్ సిబ్బంది తీర్మానం

### శుక్రవారం పలుజిల్లాల్లో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేసిన సెర్ప్ సిబ్బంది





నిజామాబాద్, బతుకమ్మ :రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ సెర్ప్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు రాష్ట్ర నాయకులు కుంట గంగాధర్, ఏపూరి నర్సయ్యలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో మొక్కలు నాటి సంబరాలు చేసుకున్నారు. జిల్లాలోని గోవింద్ పేట లో భీమ్ గల్ ఐకెపి ఏపీయం ప్రమీల ఇంటి ముందు సీసీ రఘుపతి తో కలసి సెర్ప్ ఏపీఏం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్ మొక్కను నాటి సంబరాలు చేసుకున్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్ లో సెర్ప్ సీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎపూరి నర్సయ్య మొక్కను నాటారు. నాగర్ కర్నూల్, జగిత్యాల, కరీంనగర్, మెదక్ జిల్లాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ నాయకులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కుంట గంగాధర్, ఏపూరి నర్సయ్యలు మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగులకు పెస్కేల్ వర్తింపు చేసినప్పటికీ 3974 ఉద్యోగులకు క్యాడర్స్ తక్కువ చేసి ఇచ్చారని అందుకే అందరికీ రెండు క్యాడర్స్ పెంపు చేయాలని సిఎం రేవంత్ రెడ్డికి స్టేట్ జేఏసీ తరపున విన్నావించగా సానుకూలంగా స్పందించారన్నారు. సంబంధిత లెటర్ ఎండార్స్ చేసి పంపారన్నారని, బదులుగా సీఈఓ దివ్యా దేవరాజన్ ఐఏఎస్ పంపిన ప్రతిపాదనల దస్త్రం ఆర్థిక శాఖ లో ఉందన్నారు. అలాగే సర్వీస్ రూల్స్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందన్నారు. పోస్టుల పెంపు, రిక్రూట్ మెంట్ చేయాల్సి ఉందని అన్నారు. తొందరలోనే స్టేట్ జేఏసీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి వినతులు పరిష్కారం చేస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. మంత్రి సీతక్క పుట్టిన రోజు సందర్భంగా కేక్ లు, స్వీట్లు వంటి వృధా ఖర్చులు కాకుండా ప్రకృతి పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్న దివ్య ఐఏఎస్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు యూనియన్ నాయకులు పలు చోట్ల మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. వచ్చే ఏడాది ఇదే రోజున 50 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు, సిబ్బంది కలిసి తలా 2 మొక్కల చొప్పున మొత్తం కోటి మొక్కలు మంత్రి సీతక్క పుట్టిన రోజున నాటి తమ డిమాండ్లు నెరవేర్చినందుకు కృతజ్ఞత చెప్పాలని ఈరోజు తీర్మాణించామన్నారు.

# భూభారతి భూముల రీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలి

### ఏడి శ్రీనివాస్



ఇందల్వాయి, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి భూముల రీ సర్వే లో భాగంగా ఇందల్వాయి మండల కేంద్రంలోని మల్లాపూర్ గ్రామపంచాయతీ లో భూభారతి భూముల రీ సర్వే గ్రామ సభలను గ్రామ సర్పంచ్ దర్శనం మోహన్ అధ్యక్షతనలో నిర్వహించారు. అనంతరం ఏడి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు గ్రామసభ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లాలోని 70 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు గ్రామాలుగా తీసుకోవడం జరిగిందని తెలిపారు. దీనిలో మూడు గ్రామాలను ఎంపిక చేయగా మొదటి విడతగా మల్లాపూర్ గ్రామంలో భూముల రీ సర్వే డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని ప్రజలకు సూచించారు. రెండో విడతగా గౌరారం, మూడో విడతగా వెంగల్పాడు గ్రామాలలో రీ సర్వేలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటగా మల్లాపూర్ గ్రామం యొక్క విస్తీర్ణాన్ని డిజిటలైజేషన్ చేసి దాని తర్వాత కాలువలు, రోడ్లు, ప్రాజెక్టులు, వాటిని కూడా రీ సర్వే చేసి డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. గతంలో 1920, 1930, సంవత్సరాలలో చైను గొలుసులతో భూములను కొలిచే వారన్నారు. ఇప్పుడు డిజిటలైజేషన్ సర్వేతో శాటిలైట్ ద్వారా గ్రామ సరిహద్దు ముఖ్య ప్రాధాన్యతగా గ్రామ కంటాలు అనగా ఇండ్లు స్కూల్ భవనాలు రోడ్లు వంటివి సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టాదారు పాసు బుక్కు ఉన్నవారు ఒక ఏరియాకు పది సర్వే నంబర్లు కేటాయించినట్లయితే ఆ పది నంబర్లు పూర్తయ్యే వరకు వాటిని డిజిటలైజేషన్ చేసి కొత్త సర్వే నంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక కుటుంబంలో నాలుగు ఎకరాల భూమి ఉన్నట్లయితే ఇద్దరు కుమారులు ఉంటే ఇప్పుడే ఎవరిది వారు చేయించుకోవాలన్నారు. దీనికి నూతన భూదాద్ ద్వారా పట్టా నంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సర్వే చేసిన రైతులకు భూదార్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. భూభారతి రీ సర్వే చేసిన తర్వాత ఏమైనా తప్పులు ఉన్నట్లయితే 60 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 60 రోజులు దాటిన తర్వాత తమ పరిధిలో పరిష్కరించే అవకాశం లేదని తెలిపారు. ఇలాంటి కేసులు ఏమైనా ఉన్నట్లయితే హైకోర్టును సంప్రదించాల్సి వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దర్శనం మోహన్, ఉప సర్పంచ్ కళావతి, పంచాయతీ కార్యదర్శి సుప్రియ, గ్రామ రైతులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు వేయాలని కోరిన కుటుంబంపై కార్పొరేటర్ భర్త దాడి

### 29వ డివిజన్‌లో ఉద్రిక్తత

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :స్థానికంగా రోడ్డు నిర్మించాలని కోరినందుకు ఓ కుటుంబంపై దాడి జరిగిందని బాధితులు ఆరోపించారు. ఈ ఘటన 29వ డివిజన్‌లో జరిగినట్లు సమాచారం. బాధితుల కథనం ప్రకారం, మహమ్మద్ నహీం, ఆయన కుటుంబ సభ్యులు వర్షపు నీరు నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోడ్డు వేయాలని స్థానిక కార్పొరేటర్‌ను కోరారు. అయితే ఈ విషయంపై జరిగిన వాగ్వాదం అనంతరం కార్పొరేటర్ అనీస్ ఫాతిమా భర్త ఎం.ఏ.ఖదీర్, ఆయన కుమారుడు కలిసి తమపై దాడి చేసి కొట్టారని వారు ఆరోపిస్తున్నారు. ఘటన అనంతరం బాధితులు డయల్ - 100 కు ఫోన్ చేయగా, పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. ఈ ఘటన అనంతరం కార్పొరేటర్ దాడి చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవగా, పోలీసులు మాత్రం తమకి ఎలాంటి ఫిర్యాదులు అందలేదనడం గమనార్హం.